శ్రీ ర స్తు.

# తారాబాయి.

## మొదటి ప్రకరణము.

ఉ. ఏమహనీయుఁ గ్గాన నతీంద్రియం బాహతకర్మ ఘనన్ యతి
స్వాములు సర్వయత్నములు సల్పుదు రేతసిఁ బొందలేక యా
ప్రామికుఁ ల్వాడిం దిరిగి వచ్చెను డెందముతోడ వాపరం
ధాముఁ బరాత్పరు న్మది నుదారముదంబునఁ గొల్తు నెంతయున్.

తా నొకటి దలఁచిన దైవమొకటి తలంచు ననెడిలోకోక్తి సార్థకంబని నేఁడుతోఁచుచున్నది. నా చేసిన ప్రయత్నము విఫలమగుటయే కాక స్థానభ్రష్టత్వమ్ము పరీభావంబుగూడ సమకూరె ఔరా! ఆదురాత్ముఁడు నన్నెట్లు మోసపుచ్చినాఁడు! మొదట నర్ధరాజ్యం బిచ్చెదనని నాగ్రహము చేసి సాంత్వవచనంబులతోఁ దన కార్యంబుల సఫలీకరించికొనుచుఁ దుదకు నాకేమియు నీయక కట్టుగుడ్డలతో వెడలఁగొట్టినాఁడు. అకటా! ఆదుష్టుఁ డిట్లు చేయుననియెఱుంగను. అతనికుమారికయే రాజ్య మేలునఁట. దాని కిట్టి చెడుబుద్ధులు పుట్టుచున్న వేమో! 'చెట్టు చెడు కాలంబునకుఁ గుక్కమూతిపిందెలఁగాచు' నను లోకోక్తి ఇపుడు సార్థక మగుచున్నది. అబలకు రాజ్య మేలునంతటి సామర్థ్యముండునా? చేతులకు గాజులఁ దొడిగికొని పెరవారిఁ జూడ సిగ్గుపడుచు సంతతపురంబులో వర్తింపఁదగిన స్త్రీ లెక్కడ? కత్తి చేతఁ బట్టికొని ప్రాణంబులకైన నాసింపక జంకక యుద్ధరంగంబులయందు శత్రుసైన్యంబుల నెదుర్కొని తద్బలయుతంబుగ వారిఁ జక్కడంచి ప్రజల కుపద్రవంబు గలుగనీకుండ రాజ్యంబు పాలించు టెక్కడ? నీతినిపుణులును బరాక్రమశాలులును ఆయా షడ్విద్యాచతురులు నైన యుత్తమరాజపుత్త్రులే తమతమ రాజ్యంబులఁ గాపాడి

నని నీతి కోవిదులు వక్కాణించుచున్నారు. ఇట్లుండ నేనెట్లులు యుద్ధము చేయఁగలను? కాన దండోపాయము ప్రస్తుతము యుక్తముగాఁ గనిపింపదు. సామోపాయ మవలంబించినచో కార్యము నెఱవేఱుట నిశ్చయమని పెద్దలందురు. కాని యదినాకు వలనుపడదు. ఇప్పుడు నేఁడిదిగో తోధానగరంబునకుఁ బోయి వారితో మైత్రి చేసి రహస్యముగా నందఱ నాయధీనము కావించికొని యదరువేది వారలఁజంపి కదా? రాజ్యంబు చేకొనవలయును అది యెట్లు పడిపడును? ఆరాజునకుఁ బ్రాణాప్తమయిన కూఁతును విషముపెట్టి చంప యత్నించిన నన్ను వారలు తిరిగి నమ్ముదురా! అప్పుట వారందఱకు నా దుష్టచేష్టలు బోధపుట్టించి యుండఁగా నేనిప్పుడు పోయి వేఁడుకొన్నను వారు జేరఁదీయుదురా? నీతినిపుణుండగు నారాజంత యవివేకిగాఁడు. మొదటనేఁ దెల్వితక్కువపనిఁ జేసితిని. ఆరాజపుత్రికనుఁ బెంచుచున్నదాదికిఁ దగినంత లంచమిచ్చియామెచేత నాపిల్లను జంపించినచో నామనోరథము తప్పక నెఱవేఱవలసినదే? ఇంతకు నాయవివేకమే నన్నుఁ జెఱిచినది. అట్లే చేసినచో పిల్ల తప్పకమృతినొందియుండును. ఆరాజును చేయునదిలేక రాజ్యము నాకే యొసంగును. అయిన నిప్పుడు విచారించుట గతజలసేతుబంధనముపంటిది. ముందు గర్తవ్యమాలోచింపవలయుఁగాని యిట్లు విచారించుటవలన లాభమేమి? ప్రస్తుతము సామదండోపాయంబులు ప్రయోక్తవ్యములు కావు. మఱియేరాజపుత్రునినైనఁ దోడుగాఁగొనినచ్చి వారల జయింతమన్నను, వారివారిరాజ్యంబులు గాచికొంటయే మిగులఁ గష్టముగానుండ నారాజపుత్రులు నాకు సాయపడవత్తురా? అయినను బెక్కండ్రు రాజపుత్రులగౌరవమునకుఁ బాత్రుండైనయీరాజు పైకిఁ గత్తిగట్టెడురాజకుమారుఁడే నాకంటికిఁ గనబడఁడాయెను. కాన నీరాజపుత్రులనాశ్రయించినను లాభములేదు. ఇక్కాలమున హిందూదేశమున మిగుల బలిష్ఠులును పాపకార్యములకు వెఱవనివారును దురుష్కప్రభువులు తప్ప మఱియెవ్వరును లేరు. నేఁబోయి వారలనాశ్రయించినచో నాకార్యము నెఱవేఱకమానదు. నేను ముందుగా వారియొద్దకుఁబోయి తేనెలొలుకు పలుకుఁ బలుకులచేవారిని నావలలో వేసికొనవలయును. దుర్మార్గులు మూర్ఖులునగు నాతురుష్కవీరులు నామాటలకు లోఁబడుదురురా? పోనిమ్ము రాజ్య మిచ్చెదనని యాశపెట్టినచో వారు రాజ్యము

ర.—(నాలుగడుగులిడి) క్రిందఁబ్రాకుచున్న మల్లీలతను దీసి పందిరికెక్కించి, చెలీ! ఈమల్లీలత యెంతబాగుగఁ బ్రకాశించుచున్నదో చూడుము.

తా.—ఔను. నిశ్చయమే. పండితులు, లతలు, సదాశ్రయణంబు లేనిచో జక్కఁగఁ బ్రకాశింపరు.

క.—ముఖ్యమైనది విడిచినారు.

తా.—(గ్రహించి, తనలో) "సదాశ్రయేణ శోభంతే పండితా వనితా లతా" అన్నటుల మీరుఁగూడ నాశ్రయంబు గలిగినచో మిగులఁ బ్రకాశింతురని చెప్పి నన్నునెకసక్కెములాడుచున్నది. (ప్రకాశముగా) చాలు చాలు. తెలిసినది నీవు కష్టపడిచెప్ప నక్కఱలేదు.

ర.—(నాలుగడుగులు నడిచి రత్నంబులతోఁజెక్కిన సింహంబు జూచి) చెలులారా! ఈరత్నసింహం బెంతభయంకరముగా నున్నదో! చూచితిరా?

క.—ఔను. రత్నసింహజనితమైనభయంబు నీకుండిన నుండవచ్చు. గాని మాకట్టిభయము లేదు.

తా.—(కొంచెము నడచి) కలవాణీ! మన రమాబాయిమనంబు రత్నసింహాపహృతంబయినది. కావుననే మనంబు నాకర్షించుకొని రాలేకున్నది. రమ్ము పోదము.

క.—ఒకరిచే మనం బపహృతంబయినప్పుడు దానినాకర్షించుకొనుట కష్టముగదా? అందఱకు నది యనుభూతమే.

తా.—(తనలో) నన్నుఁగూడ నెత్తిపొడుచుచున్నది. అని తలంచి మాటాడక యట్లు పోవుచుండు.

ర.—(తనలో) తారాబాయి, కలవాణి, వీరిరువురు రత్నసింహపదమును శ్లేషించి, రత్నసింహుఁడనియెడు నర్థముచెప్పి యెకసక్కెములాడుచున్నారు (ప్రకాశముగా) చెలీ! ఆశ్లేష చాలు లెండు. మీయభిప్రాయంబు నాకుఁ దెలియకపోలేదు!

క.—ఆశ్లేష యిప్పుడేమి తెలియును? ముందుముందు తెలియఁగలదు. ప్రస్తుతమాశ్లేష మనస్సంకల్పితంబు మాత్రమే.

నను వానిని మ్రింగుదును. నాగుడిలోఁ దప్ప బైని దీపముండఁగూడదు" అని యూరకుండె. ఆమాటలు విన్నతోడనె యచ్చటి వారందఱును తోఁటయవతలి భాగంబున కరిగి నిలిచియుండిరి. అంత భిల్లనాథుఁడు దాసుని మఱియొకరిని నచ్చటనుండ నియమించి నరబలియిచ్చినతోడనే కేక వేయవలయునని చెప్పి యామందిలోనికిఁబోయి కేకలిడవద్దనియు, దాసుని కేక విన్నతోడనె మీరు బలు లర్పించి పరుగిడవలయుననియుఁ జెప్పి సంసిద్ధులఁగాఁ జేసె. అంత దాసుఁడు గుడిలోనికరిగి పూజచేసివచ్చి బద్ధుండయి దుఃఖంబుచే సొమ్మసిల్లియున్న యాపురుషునిఁ జేతితోఁదట్టిలేపి రెండవవాని జూచి జాగ్రత్తగాఁ బట్టికొమ్మనిచెప్పి ముమ్మాఱు తనకు దావలఁగాని చేతిని బైకెత్తి సత్తువకొలఁది నఱికెను. గాని బలిష్ఠుఁడైన యాపురుషుండు పట్టుకొనిన వానికట్టు దప్పించుకొని తిరిగిపోఁ నందున వానికిఁ దగులక యా వ్రేటు క్రిందనున్న మ్రానికిఁ దగిలెను. అంతట దాసుండు మిగుల గోపించి గట్టిగపట్టుకొమ్మని మఱల నఱకసిద్ధముగానుండఁగా, దలయొకటి త్రుళ్లిపడియె. అదిచూచి పట్టుకొనినవాఁడు కేకలువేయుచుఁ బర్విడి గ్రామమువంక పోవుచుండెను. అంత నచ్చటివారలు తమతమ బలుల నర్పించి తమతమయిండ్లకరిగిరి. గాని దాసుం డెంతరాత్రికి నిల్లుచేరలేదు. అందుచే వానికుటుంబము భిల్లనాథునికిఁ దెల్పగా వాఁడు రెండవ వానిని బిలిచి దాసుఁడేఁడీ యని యడిగెను. అంత వాఁడు దాసునిసంగతి నాకుదెలియదు. నరబలియిచ్చినతోడనె నేఁ బర్విడివచ్చితిని. నరబలి యీయఁబడెను. ఆలస్యముచేసిన ప్రాణంబులు దక్కవని పర్విడి వచ్చితిననియె. అంత భిల్లనాథుండు జక్కఁగా గొంతసేపు యోజించి, యాగుడియొద్ద జరిగిన వృత్తాంతము నంతయుఁ దెలిసికొని దాసునిభార్య కిట్లనియె. "దాసుఁడు బలిసరిగా నీలేకపోవుటచేతను, బలియిచ్చిన వెంటనే పర్విడిరాకయాలస్యముచేయుటచేతను దేవతయే వానిని జంపియుండును. వానిగూర్చి విచారించిన లాభము లేదు. భర్త యపరాధముపోవు నిమిత్తము మఱువటియేఁ డొకమేఁకపోతును బలియిచ్చెద నని మ్రొక్కుకొనుము. దానివలన మీకు క్షేమము కలుగును. లేనిచోఁ గలుగదనిచెప్పి దానిచే నట్లు మ్రొక్కించి యింటికిఁబంపి తానును తనగృహంబున కేఁగెను.

## పదునెనిమిదవప్రకరణము.

మాళవరాజునకును దామోదరసింగునకును మిత్రభావము క్రమముగా హెచ్చఁజొచ్చెను. అందువలన వారిరువురును సర్వకాలంబులయందు నొకరి నొకరు విడనాడక వర్తించుచుండిరి. దామోదరసింగునకు ప్రత్యేక మొక మేడ యున్నను నది కేవలము భోజనగృహమాయెనే కాని నివాసభవనము కాలేదు. తననివాసమెప్పుడును మాళవరాజు సౌధరాజమే యైయున్నది. వారెల్లకాలమ్ము లందును జిత్తూరుజయించుటను, తారాబాయిని గొనివచ్చుటకు దోధానగరంబు దామోదరునకు వశమగు నట్లు జేయుటకు నాలోచించుచుండిరి వీరికీయాలోచన తప్పనన్యాలోచన లేమియుంలేవు. అందుచే నొకనాఁడు వారిరువురు నొక్కచోఁగూర్చుండి యిట్లు సంభాషింపఁదొడంగిరి.

రా.—మిత్రమా! చిత్తూరురాజ్యలక్ష్మిని వేగముగా వరింపవలెనన్న కోరిక మిగుల బాధింపుచున్నది.

దా.—ఒక్కరాజ్యలక్ష్మినే కాదు, తారాబాయినిగూడ వరింపఁగలరు.

రా.—అవును. ఈరెండిటికై నామనము త్వరపడుచున్నది.

దా.—ఉత్తముల చిత్తంబులు గొప్పకార్యంబు లాచరించుట కెప్పుడు త్వరపడుచుండుట స్వభావమె.

రా.—నిక్కము పల్కితివి. ఈరెండు కార్యంబులు ఘనకార్యంబులే.

దా.—కాదా? అందులోఁ జిత్తూరునగరంబును వశంబుగావించుకొనుట మిగుల నుత్తమకార్యంబని చెప్పవలసి యున్నది. నాఁడల్లాయుద్దీను వశంబు కావించుకొని ఖ్యాతిచెందినాఁడు. నేఁడు మీరు ఖ్యాతి జెంద దలంచి యున్నారు. తక్కిన తురుష్కప్రభువులలో మీవంటి వారేరి.

రా.—నిజమే, తారాబాయిని వరించుట యంతకంటెను ఘనకార్యంబు. చిత్తూరు రాజ్యలక్ష్మిని వరించినవాఁడింకొకఁడున్నాఁడు. కాని రాజ

పుత్రి కన్యవరించిన తురకరాజు గానరాఁడు. ఇందులో నేనిరుపమా నుండనే.

దా.—(పకపక నవ్వి) వహ్వా! బాగా సెలవిచ్చితిరి. నిజముగా రాజపుత్రికను వరించినతురక లేఁడు. మీజీవితకాలంబులో నీరెండును ఘనకార్యములే.

అని వీరిరువురును మాటలాడుకొనుచుండు సమయమున నొకరాజభటుఁడు మెల్లనమేడపైకరుదెంచి దామోదరసింగునుజూచి మీకోసమెవరో వచ్చియున్నారని చెప్పెను. అంత దామోదరుఁడు లోపలికిఁ బంపుమనుఁడు వాఁడట్లు లొనరించె. అంత నొకపురుషుఁడు మెల్లమెల్లగా వచ్చి వారికి నమస్కరించి నిలుచఁబడె. అంత దామోదరుఁడు వానితో నిట్లుసంభాషించె.

దా.—ఒరీ? నీవెక్కడివాఁడవు?

భ.—స్వామీ! మానివాసము భిల్లవాటిక.

దా.—నిన్నెవరు పంపినారు?

భ.—భిల్లనాయకుండు పంపినాఁడు.

దా.—నీచేతికేమైన యుత్తరంబు లిచ్చెనా?

భ.—ఇచ్చియున్నాఁడు.

దా.—ఇటు తెమ్ము?

భ.—(అతఁడు మూట విప్పి దామోదరున కిచ్చును.)

దా.—నోటిమాట లేమైనఁజెప్పెనా!

భ.—లేదు మహాప్రభూ! యీయుత్తరముమాత్రమే యిచ్చినాఁడు.

రా.—అట్లైన నీవు క్రిందనుండుమనిచెప్పిపంపి దీపమునొద్దకుఁబోయి చదువుకొని సంతోషవిచారంబులు మనంబునఁ బెనగొన మాళవరాజునొద్దకు వచ్చి కూర్చుండి యతని కిట్లనియె.

దా.— మహారాజా! కార్యము చాలభాగము నెఱవేఱినది.

రా.—ఏమి నెఱవేఱినది?

దా.—రత్నసింహునికి సూరధానులకు భేదముకల్పించునట్టి యొకయుత్తరంబు

ప్రాయుంటయు, నందువలన నతఁడు రత్నసింగును బురమునుండి వెడలఁ గొట్టుటయు మీకింతకుమున్నే తెలిసియున్నదిక దా ?

రా.—ఔను. ప్రస్తుతవృత్తాంత మేమి?

దా.—ఆరత్నసింహుఁడు విచారగ్రస్తుండై యడవులంబట్టిపోవుచు నాయాసంబున నొకచెట్టునీడ నిద్రించుచుండెను.

రా.—తరువాతియుదంత మేమి?

దా.—అది భిల్లులు, భిల్లనాథుండును జూచి వానిని బంధించి నేఁ జెప్పిన ప్రకారము గ్రామదేవతకు బలియిచ్చినారఁట.

రా.—వహ్వారె! బాగుబాగు! రత్నసింగు చచ్చినాఁడే? ఇఁక రాయలకు దిక్కేది ?

దా.—ఏమున్నది? హారావళియందున్నయడవులే దిక్కు.

రా.—ఇంకను విశేషములేమి ?

దా.—రెండవకార్యంబుగూడ ఫలోన్ముఖమయినది. కాని చెడిపోయినది.

రా.—ఆకార్యమేమి ?

దా.—తారాబాయిని గొనివచ్చుట.

రా.—(తొందరతో) ఏమయినది ?

దా.—రాయలు కుమారితోఁ బూలతోఁటయందు విహరింపఁబోయెనఁట.

రా.—తరువాత

దా.—ఆరాజు విహరించుచుండఁగనే యొకగాలి వీతెంచెనఁట.

రా.—సమయము బాగునున్నది. తరువాత నేమిజరిగినది?

దా.—సర్వదా యాప్రాంతంబులఁదిరుగుచు సమయమునకై వేచియున్నభిల్లులు గనిపెట్టి, యాతండు పూలతోఁటనుండి పురంబునకుఁ బోవుచుండఁగా నాబండి నరికట్టి తారాబాయిని తీసికొనివచ్చిరి.

రా.—కార్యము నెఱవేఱినదే.

దా.—కాని యాసమయంబునఁ బ్రళయాంతకుఁబోలిన యిద్దఱుపురుషులాభిల్లులను నఱికి యాపిల్లను విడిపించుకొనిపోయిరఁట.

జయించి మాళవరాజును విడిపింపలేకపోమని ధైర్యంబు తెచ్చుకొని సైనికులఁ బురికొల్పి మరలఁ బృథ్వీరాజును దాఁకెను. అంత పృథ్వీరాజు సైనికుల వెంటఁబెట్టుకొనివచ్చుచున్న పినతండ్రిని దాఁకియాతనితోఁ బోరాటమారంభించె. ఇట్లు వారిరువురు కొంతవడిఁ బోరిరి. కాని సురాజమల్లు పృథ్వీరాజు నద్వితీయపరాక్రమంబును సహింపలేక పలాయితుఁడయ్యె. అతనితోడనే తక్కిన సైనికులును తమపాదములకు బుద్ధిచెప్పి పర్వుడఁజొచ్చిరి. అంతఁ బృథ్వీరాజాదులు నిరాటంకంబుగాఁ బోవుచుండిరి. ఆసమయంబున నబ్దుల్లాఖాను మొదలగు వీరులు కొందఱు తమ ప్రభూత్తముండు శత్రువులకుఁ జిక్కియుండ నూరకుండుట యనుచితంబుగాదని లేనిధైర్యంబు దెచ్చికొని మరలఁ బృథ్వీరాజును దాఁకవచ్చుచుండిరి. కాని అది పృథ్వీరాజు చూచి వారివంకదిరిగి పెద్దయెలుంగెత్తి "ఓరీ! దురాత్ములారా! మీరు సాహసించి ముందుకు రావద్దు. అట్లు వచ్చితిరేని దక్షణ మందే మీరాజును బొడిచిచంపెదను. మీరట్లు రానిచో మీప్రభువునకేమి యపాయము గలిగింపక విడిచి పుచ్చెద"నని కేకవేసెను. ఆవీరులు రాజపుత్రు లన్నమాటదప్పరు కావున రాజు ప్రాణముల కపాయము రాదని నిశ్చయించి గుఱ్ఱముల నాతని వెంబడింపరారైరి. ఈకలకల మంతయు విని చిత్తూరులోని రాజపుత్రులు కోటగోడలపైఁ గూర్చుండి శత్రువులు వారితో వారు కలహించుచున్నారని యెంచి కన్నులపండువుగాఁ జూచుచుండిరి. వారు పృథ్వీరాజు వచ్చియున్నాఁడన్న వార్తయె యెఱుంగరు. అది రాయమల్లు చూచి శత్రువులలోఁ గలహముపుట్టెను గావునఁ జిత్తూరు వారి పాలఁ బడకుండ గాపాడవచ్చునని యెంచుచుండెను. ఆసమయంబునఁ బృథ్వీరాజు సింహద్వారము సమీపించి తన తండ్రికి వర్తమానమంపెను. అంత రాయమల్లు తనకుమారుండు మాళవరాజును బంధించి కొనివచ్చుచున్నాఁడని విని పరమానందభరితుండయి యెదురుచని కోటలోనికి రప్పించెను. అంతఁ బృథ్వీరాజు మాళవరాజును గొనివచ్చి తండ్రి పాదములపైఁ బడవేసి నమస్కరింప నతఁడు కుమారునిపరాక్రమంబునకును, పితృభక్తికిఁ గడుంగడు మెచ్చుకొనియె. అనంతరము రాయమల్లు విచారపరీతస్వాంతుండయి యవమానంబుచే వెలవెలఁబోవుచున్నముఖంబుతో దనపాదసన్నిధియున్న మాళవరాజుంజూచి కనికరించి కట్లువిప్పించి యతని కుచితమర్యాదలఁ గావించె.

ఆమెను బెండ్లాడి జీవించుట మిగులఁ గష్టము. మాధవసింగుగతి యేమయినదో యాలోచింపుఁడు.

మా.—మాధవసింగు వెడఁగువాఁడు. కావున మోసపోయినాఁడు. అతనిచరిత్ర మొకనిదర్శనముగాఁ గొనకుము.

దా.—అట్లుకాదు. స్త్రీలు తమ కిష్టములేనిచో బ్రహ్మాండనాయకునినైన నిముసమాత్రములో మోసపుచ్చి చంపఁగలరు. కావున నాకుఁ బెండ్లి చేయ నక్కఱలేదు. మీకును నా రాకన్నియకును బదివేలవందనంబులు.

మా.—(కోపముతో) ఓరీ! తుచ్ఛా! వీరుఁడ వనిపించుకొని సేనాధిపత్యము వహించియుం, నాఁడుదానికి వందనంబులు చేసెదవు. సిగ్గు లేదా! పోపో.

దా.—(సంతసముతోఁ బయిటికిఁ బోవును.)

మా.—ఓయీ! నాజర్‌ఖాన్! నీ విటు రమ్ము.

నా.—సమీపించి నిలుచును.

మా.—నీవయిన నాయాజ్ఞఁ దలఁ దాల్చి రమాభాయినిఁ బెండ్లాడుదువా?

నా.—మహాప్రభూ! దేవరవారి యాజ్ఞ నెప్పుడు శిరసా వహించియే యున్నాము.

మా.—ఎల్లప్పుడు కాదు. ఇప్పటిమాట చెప్పుము.

నా.—(భయముతో) ఆమెను బెండ్లాడుటకు భయపడుచున్నాను.

మా.—పోషించుట కష్టమనియా!

నా.—కాదు లొంగదీసికొ లేక.

మా.—ఓరీదుర్బలా! ఒక్కయాఁడుదాని లొంగదీసికొలేనివాఁడవు పెక్కు సైనికుల నెట్లు లొంగఁదీసికొనుచున్నావు?

నా.—మహాప్రభూ! సైనికుల నెందఱినైన వశము కావించుకోఁగలను కాని యాకాంతను వశముకావించుకోలేను. యుద్ధములందు శత్రువుల యాయుధపుదెబ్బలనయిన సహింపఁగలనుగాని, యాకాంతనిందావాక్యములు సహింపలేను యుద్ధమందు శత్రువులతోఁ బోరాడి వారిచేతిలోఁ జచ్చుటకు జంకనుగాని, యాఁడుదానిచేతిలో చచ్చుటకు జంకుచున్నాను.

ప్రభువుసందర్శనంబునకువచ్చి తనయభిలాషతీర్చి నన్నుఁ గృతార్థుఁజేయుం డని బహువిధంబులఁ బ్రార్థింపసాగెను. ఆఫకీరు భూలోకసుఖములందును, తన్మూలకంబులగు ధనంబులందును నాశలేనివాఁడు. కావున మహారాజులపైనఁ దృణప్రాయంబులుగాఁ జూచువాఁడేయయినను బరోపకారశీలుం డగుటంబట్టి యందులకంగీకరించి సాయంకాలము రాజసందర్శనంబునకుఁ బోదమని యబ్దుల్లాతోఁ జెప్పె. అంత నబ్దుల్లాసంతోషమునం బొంగిపోయి మునుపు కారణాంతరముఁ దప్పించికొని రాజదర్శనంబునకుఁ బోవనివాఁడే యయినను ఇప్పుడందరకంటె ముందుగా నాశుభవర్తమానంబు రాజునకుఁ దెలుప సత్వరంబుగఁ బర్విడి పోయెను. ఇట్లబ్దుల్లా రాజసన్నిధిఁ జేరి యాఫకీరువృత్తాంతమంతయు నిన్నవింప నతఁ డాలకించి యత్యంతసంతోషముఁ జెంది యతని గారవించి యాఫకీరువద్ద నంబుచేయఁ గుతూహలుండైయుండెను. అంత సూర్యాస్తమయంబగుడు నబ్దుల్లా ఫకీరునొద్దకుఁబోయి యాశ్రయించియుండి నాలుగుగడియలరాత్రి కాఫకీరుతోఁగూడ రాజసందర్శనంబునకుఁ బోయె. వీరాకయు రాజు సంసిద్ధుండయి వేచియున్నాఁడు కావున వారువచ్చుచున్నసంగతి నాలకించి వెంటనే యెదురుచని నమస్కరించికొని వచ్చి యుచితాసనమిచ్చి కూర్చుండ నిచ్చి తదనుమతంబునఁ దానొకయాసనంబున నధివసించి యాఫకీరుతో నిట్లు ప్రసంగించె.

రా — స్వామీ! తాము మొదట నెచ్చటివారు?

ప. — మేము ! మొదట మక్కాపట్టణమందలివారము.

రా. — మక్కానుండి మతమువిస్తరించుటకే వచ్చినారు కాబోలును?

ప. — అవును. ఈహిందూదేశపుఁ బ్రజలందఱు దురాచారంబుల నవలంబించి గురువును బొందని యొకచెడుమతము స్వీకరించి నిష్కారణముగాఁ జెడుచున్నారు. అందుచే వీరికందఱకు మనమత మాపదేశించి బాగు చేయవలెనని వచ్చినాను.

రా — అవును. హిందువులు బుద్ధిహీనులు. వారందఱు నొకమూకవజాతివార లయినను వారిలో వారొకరికంటె నొకరధికులమని చెప్పుకొనుచుందురు. ఇందున్నవారి కొకమతమనియును, నొకజాతియనియును లేదు. తమకొకమతముకలవారయియున్నారు. మీరు వారలంగరుణించి

## ముప్పదితొమ్మిదవ ప్రకరణము

మాళవ రాజు తోధాపురంబును వశంబుగావించుకొనిన కొంత కాలము
నకు నవరాత్రి దినముల యుత్సాహంబుతోఁ జేయవలసిన పీర్లపండుగుదినంబు
లేతెంచె. మహమ్మదీయు లుత్సవంబు నొనర్ప మిగుల వేడుకగలవారై యుండిరి.
మఱియును వారు గ్రామంబున రెండుమూఁడు కుటుంబముల వారు మాత్రమే
యున్నప్పటికి నాయుత్సవంబును జేయుచునుండిరి. వారొకవేళఁ దినఁ దిండిలే
నంతటి నిరుపేదలైనప్పుడు యాచించియైన ధనంబు సమకూర్చికొని యాయుత్స
వంబు చేయుచుండిరే కాని యూరకుండ జాలరు. మాళవరాజునకుఁ దోధాపురం
బును, దాని రాబడియును, సంప్రాప్తించుటంబట్టి యత్యంతసంతోషమున మునిఁగి
యున్నవాఁడు. కావున నా దినంబులు రాఁగానే మహమ్మదీయులను బిలిచి
యిట్లనియె. ఓయీ! ఇంతకాలము మాళవదేశమం దీయుత్సవంబును జేయు
చుండెడివారము. మనదేశములో పండుగు చేసినది యొకగొప్పకాదు. ఇప్పు
రంబు నిదివఱకు హిందూరాజులు పరిపాలించినవారు కావున వారల రుచి
తమయుత్సవంబులఁ జేయుచుండెడివారు. మన కీపురంబు క్రొత్తగా
సంప్రాప్తించినది గావున మన మీపురంబునఁ బీర్లపండుగు మహావైభవంబుతోఁ
జేసి యందఱకు బుద్ధివచ్చునట్లు చేయవలెనని చెప్పి యధికంబుగ ద్రవ్యం
బొసఁగె. ఆ ద్రవ్యంబును పుచ్చుకొని యాపండుగునకు వలసిన వస్తుజాత
మును సంపాదించి యథావిధి నిర్వర్తించుచుండిరి. అంతఁ బీర్లనుపునట్టిదినం
బరుదెంచె. నాఁడు మహమ్మదీయులే కాక హిందువులుకూడ దానికనుకూలు
రైతోడ్పడిరి. ఆసమయమునఁ బ్రజలెల్లరుఁ గొందఱు తమకుఁ దోఁచినవిధ
మున నానావిధ వేషముఁ దాల్చి ధనవంతులయాచించి ధనంబు మూటఁగట్టికొను
చుండిరి. వీరు కేవలము ధనవంతులనే కాక మాళవరాజుదర్శనమునకుఁ గూడఁ
బ్రయత్నించిరి గాని ప్రభువు వానికి రానిచ్చునో రానీఁడో యని సందియ
పడుచుండిరి. ఇట్లు వేషము వేసికొని జనులు మూఁకలు మూఁకలుగా వచ్చు
చుండుట మాళవరాజుకుమారుఁడు గాంచెను. మాళవరాజునకు మూఁడేండ్ల
ప్రాయముగల యొకకుమారుఁడు గలఁడు. మాళవరాజున కతనిపైఁ బ్రేమ
మెండు. అట్టివాని నెంతోప్రేమతోఁ జూచుచు వాఁడు కోరినకోర్కుల

అన్నమాట వినినతోడనే సంతుష్టస్వాంతుండయి యతిగౌరవంబుతోఁ దీసికొని విచ్చి యిట్లు చదువుకొనె "మహారాజా! గతించినపనికయి విచారించుట నిష్ఫలంబు. పృథ్వీరాజిఁక వచ్చి విడిపించునన్న యాశ లేదు. మీకుఁ బ్రతికూలముగా వర్తించి యావజ్జీవము పలుబాము లనుభవించుటకంటె మీదయను సంపాదించి సుఖమనుభవించుటె యుచితమని తోఁచినది. మహమ్మదీయు లయినను దమ్ముఁ బెండ్లాడ సందియంబు లేదు. ఇంతకుముందు రమాబాయి పెండ్లాడినది. లోకాపవాదమంతయు నామె నే చెందును. నాకంతగాఁ గలుగ నేరదు. మార్గదర్శకురాలు రమాబాయి. ఆమె ననుసరించి పోవుటలో నాతప్పేమియున్నది? కావున నేనిప్పటిలో మిమ్ముఁ ద్రుణీకరించితినని యన్యథా తలంపక నన్ను రాజావసథంబునకుఁ గొనిపోయి రాజపుత్రాచారంబు ననుసరించి యథావిధిగఁ బెండ్లియాడుఁడు. కాని తమ కొకటి నే మనవి సేయుచున్నది. ఇఁక మీదట తోధానగరంబును రాజధానిగాఁ జేసి యుండవలె. ఇది నా చేతితో వ్రాసినయుత్తరము.

విధేయురాలు,

తారాబాయి."

అనియున్న యుత్తరంబు చదువుకొని మాళవరాజానందసముద్రంబున నోలలాడుచుఁ బకీరుప్రభావంబుఁ బలుమాఱుఁ గొనియాడుచు నాయుత్తరము తెచ్చినదాసికి ననర్ఘభూషణంబులు బహుమానంబుగా నొసంగె. అనంతరము రాజు తనహితుల కాయుత్తరంబు జూపి వివాహప్రయత్నంబులు చేయించుచుండె. అంతట వారేర్పఱుచుకొన్న పెండ్లిదినంబు వచ్చె. అప్పటికి రాజావసథంబును గన్నులపండువుగా నలంకరించిరి. ఆపురంబులోనివారందఱు రాజానుమతింబట్టి తమతమగృహంబుల మిగుల రమణీయముగా నలంకరించుకొనిరి. పురంబున నేవంకఁ జూచినను గన్నుల కానందంబు గొలుపనిస్థలం బొకటియు లేదు. వివాహమునకుఁ గావలసిన వస్తుజాతంబును సమకూర్పఁబడియె. ఇఁక రాత్రి వివాహంబు జరుగుట నిశ్చయంబని విన్నప్పుడు రాజపుత్రులందఱు మున్ను రమాబాయిని నిందించినట్లు లిప్పుడీ తారాబాయిని నిందించుచుండిరి. ఈవృత్తాంతము క్రమక్రమముగా సూరధాన్రాయుల చెవి

## నలువదియొకటవ ప్రకరణము.

మాళవరాజు తారాబాయి కరగ్రహణంబు సలుప నతికుతూహలుండయి బంధువర్గంబుచేతను, మిత్రులచేతను, బరిచారకులచేతను బరివృతుండయి యారాణిప్రియురాగమనంబు నిమిత్తము ప్రతీక్షించుచుండె. ఆసమయంబున నొకపురుషుండు కడువడివచ్చి మాళవేంద్రుని జేరి నమస్కరించి యొకయుత్తర మందించె. అంత నామాళవరాజు తొందరతో దానినివిచ్చి యిట్లు చదువదొడంగె. "ఓయీ! మాళవరాజా! నీవు దామోదరసహితుండవయి చేసిన యపరాధంబునుబట్టి యోజింప సద్యోవధార్హుండవు, అయిన నిన్నుం గరుణించి యిట్లు చేయ నంగీకరింపక నీకీయుత్తరంబు వ్రాసితిని. నీవు తోడా నాక్రమించుకొనుట యన్యాయము. ఆనగరము మా చిత్తూరు మండలములోనిది. కావున మామండలములో నిట్టియన్యాయంబులు ప్రవర్తిల్లుచుండఁ జూచి సహింపనోప. కావున నీవు తోడాపురంబును సర్వవస్తువులతో విడిచి నీమాళవమునకుఁ బొమ్ము. అట్లు పోవేని యుద్ధమునకు సిద్ధముగనుండుము. ఇమ్మట నీమాళవరాజ్యక్షేమమును గూర్చి కూడ జాగరూకుండవయి యుండుము. నీ వాలోచించుకొనుటకు రెండుదినములు గడువిచ్చితి. ఈలోపల నాలోచించి నీతలంపును దెలియఁజేయుము." అని చదువుకొని మిగుల విచారించుకొనుచుఁ దన మిత్రమంత్రిపరివారంబును బిలిచి యిట్లు ప్రసంగించెను.

మా.—ఓయీ! ఒకయాపద యేతెంచినది. దానికి ప్రతీకారమేమో తెలియకున్నది.

మ.—ఏదియో సెలవిండు.

మా.—పృథ్వీరాజొకయుత్తరంబు వ్రాసినాఁడు.

మ.—ఏమని వ్రాసెను?

మా.—తోడారాజ్యంబును రెండుదినంబులలో విడిచిపోవలెనఁట. లేనిచో యుద్ధముఁ జేయవలెనఁట.

మ.—దీని కాలోచింప నేమున్నది?

మా.—ఎందుచేత?

మ.—ఇంతకుమున్ను పన్నినయుపాయ మున్నదికాదా?

